

# పరిష్కారం

కాశీనాథ విశ్వం

దేవుని ప్రభను తీసికొనివెళ్ళటంలోనే కలతలు రేగినాయి. మంచి విషయంలో సేవా రావాలి? అలవాటుగా ఉత్సవం జరుపుతారా గ్రామంలో. మూడు వీధులు. పెద్దవీధి తూర్పువెనుక ఒక వంక వుంది చిన్నది. ఈవంకలో ఆ వీధివాళ్ళు చెత్తా చెదారం, మలం విడిచేవాళ్ళు. వంకనుండి నేరుగావెళ్తే మైదానంవుంటుంది. ఆ మైదానంలో ప్రభనుంచి ఎద్దుల్ని తిరిమేవాళ్ళు. మూడురోజులు వుత్సవం కోలాహలంగా జరిగేది. అనూచానంగా వస్తున్న ఆచారమిది. అయినా ఇక్కడ ఒక్క విషయం చెప్పకతప్పదు. వంక అపరిశుభ్రంగా వుందని చెప్పుకున్నాం. ఇపుడు పెద్దవీధిగుండా ట్రంక్‌రోడ్డుకు బండిబాట గవర్నమెంటువాళ్ళు వేయించారు. వేసినదోవలోనే మైదానం వుంది. నేరుగా వంకగుండా పోడానికన్నా శుభ్రంగా వీధివైపు వెళ్తే? బాగుంటుంది రెడ్డి - అంటే ఆ గ్రామమునసబు వున్న పెద్దలకి చెప్పాడు. ముఖ్యంగా పెద్దవీధి మేటిరైతు రంగానాయునికి. 'రంగయ్యా వంక శుభ్రంగాలేదు. వీధిగుండా పోవాలని నావుద్దేశ్యం. నీకేమని తోస్తుంది?" అని అడిగాడు.

"అలవాటుగా వెళ్ళేది వదలిపెట్టిపోడానికి వీల్లేదు వెంకట్రెడ్డీ?"

"రోడ్డుకి బాట పోతుంది. బాగా ఆలోచించు. గుల్లలో, ఇసుకలో మలంలో పోడానికన్నా ఇది చాలా బాగుంటుంది" మరలా చెప్పాడు రెడ్డి.

రంగానాయని కది నచ్చిందో లేక మంచి కైపులో వున్నాడేమొ తెలియకు ఒప్పేసుకున్నాడు. అవునవును వీధిగుండా పోనీ అంటూ జోరుగా వెళ్ళిపోయాడు. రెడ్డికి సందేహమైంది. వ్యంగ్యంగా చెప్తున్నాడేమొ అనుకున్నాడు.

మర్రోజు పిలిపించి నిక్కచ్చిగా అడిగాడు. నవ్వుతూనే "సరే మీ ఇష్టం అని ఒప్పుకున్నాడు. తిరునాళ్ళ వైభవంగా జరిగింది. మామూలువంక విడిచి వీధిలోనే వెళ్ళింది. రంగానాయకునికి పెద్దవీధి హాడల్ అతనెట్లచెప్తే అంతే! ఆ సంవత్సరం వుత్సవం యథాప్రకారం జరిగిపోయింది.

తర్వాత సంవత్సరం...

బండిబాటనుండి వెళ్ళనీ అని చెప్పిన రంగానాయకుడే వంకంటే వెళ్ళాలని పట్టుపట్టి కూర్చున్నాడు. ఆ వీధి పంచాయతీవాళ్ళూ అదే మొండిగా మాట్లాడేరు. మిగిలిన రెండువీధులవాళ్ళు ఒకటయ్యారు. వీధినుండే వెళ్ళాలన్నారు. వంకనుండే పోవాలన్నారు వారు.

రెడ్డికి కోప మొచ్చినా అణచుకున్నాడు.

"ఏంటయ్యా! ఆనాడు వీనంటే పోదామని నే చెప్తే సరే అన్నావే?"

"ఆ సంవత్సరం మాత్రానికి ఒప్పుకున్నాం. అంతేకాని మా తాత తండ్రుల ఆచారాన్ని వదులుకోమంటావా?"

"మలమూత్రంలో దేవుణ్ని .వెళ్ళనీనా?"

"అదేమొ మాకు తెల్దు. మామూలుగా పోవాల్సిందే"

"మామూలా? ఆ సంవత్సరం బాటవెంబడి పోవాలంటే ఒప్పుకున్నావ్ కదా! లేదూ ఇందులో మాకు లాభంవుండి పొమ్మంటున్నామా? శుభ్రంగా వుండే దోవగుండా పోదామంటున్నాం. ఇందులోతప్పంటే ఎవరన్నా తప్పనండి."

"ఏం రెడ్డీ మాపై కసికొద్దీ అనేమాట లేనా ఇవి?"

"లేదు రంగయ్యా నువ్వే చెప్పు."

"ఆ పప్పులేవీ మాదగ్గర పనికిరావు. వంకలో దేవుడు పోవాల్సిందే.

రెడ్డి నిదానంగా చెప్పినా నాయకులు మాట వినకుండా తీవ్ర ధోరణిలో పోతున్నాడు. చిన్న విషయాన్ని పట్టుకుని కొండంత చేసుకుంటే బాగుంటుందా అని లేదు.

"అలా అయితే నే నడుగుతున్నా దనుకో

ఉండా విను. పోయిన సంవత్సరం మామూలుకు వ్యతిరేకంగా జరుపుతున్నాం. అది మామూలనుకుందాం."

అదంతా మా కవసరంలేదు. వంకలో పోవాల్సిందే. మా వీధి ఒప్పుకుంది. మీకేం? మా ఇష్టం."

"కొండంట వెళ్ళాల్సిందే" రెడ్డివీధిలోని ఒకాయన గట్టిగా అరిచాడు.

"వంకంట పోవాల్సిందే" పెద్దవీధి పెద్దాయన గట్టిగా అన్నాడు.

"ఉత్సవం మీరే జరుపుకోండి"

"కాదు. కాదు. మీరే జరిపించండి."

"మీ వీధుల వాళ్ళేం చేస్తారో చూస్తాం"

"మీరేం చేస్తారో చూస్తాం మేం"

ఇక్కడే పార్టీ పడింది. రెడ్డిపార్టీ వాళ్ళని విడిచి పెదవీధి పార్టీవాళ్లు వెళ్ళిపోయారు. "రండ్రా" అని రెడ్డి తనవారిని తీసికొని వచ్చేసాడు.

రెడ్డిపార్టీ, నాయకుని పార్టీ వుమ్మరమైంది.

పెద్దవీధిలో రంగానాయకుని యాజమాన్యాన పంచాయతీ జరిపించి తగవులు తీర్చుకునేవాళ్ళు.

రెడ్డివాళ్ళు ఈ రెండు వీధుల సమస్యల్ని తీర్చుకునేవాళ్ళు.

రంగానాయకుడు పార్టీ డబ్బు ఎక్కువగా వసూలుచేసి ఉత్సవం ఇంతకుమునుపు జరగనంతటి ఉత్సాహంగా జరిపించాడు. ఆ ఒక్క వీధే వచ్చి వెళ్ళింది ప్రభ.

అంతా సంయ్! అంటూ రెడ్డి పార్టీ దానికి ఒకటిన్నరరెట్ల పెద్ద ప్రభగా కట్టించి జిగేల్ మనిపించేటట్లు, రెండు వాయిద్యాలొకవైపు ముందు మాలపలకలతో భజనలతో దేవుణ్ని పూలతో ముంచెత్తి పట్టువస్త్రాలు కప్పి రెండు వీధుల్లోనే బాణా సంచాలు ప్రేల్పించి పెద్దగా జరిపించారు. ముసిముసిగా నవ్వుకున్నారు.

సంక్రాంతి సమీపించింది. ఉమ్మడిగా చేయాల్సిన తతంగం అట్టే నిలిచిపోయినయ్. ప్రత్యేకంగా జరిపిస్తున్నారు. తోరణాలు వేరు, చాకలి, మంగలి, కడకు కూలీలు కూడా వేరే. ఎంతవున్నా గ్రామం. పరస్పర సహాయం లేకపోతే సాగదు. పైర్లు నాశనమయినా సరే పౌరుషంమాత్రం గొప్పగా భావిస్తున్నారు.

రెడ్డి కొంచెం నిదానస్థుడు. జరగని ఎలా జరుగుతుందో అనుకుంటున్నాడు.

పశువుల్ని వారివారి వీధుల్లో వుంచే వదుల్తున్నారు. ఎద్దుల వేగంలో కుస్తీలు పడ్డాయి. వాటితోపులకి మనుషులు కలియబడ్డారు. వారికీ వీరికీ దొడ్డ వాగ్యుద్ధంతో సాదయ్యింది. ఏ పుణ్యంవలననో ఆనాడు ఎవరికి దెబ్బ తగల్లేదు.

మర్రోజు కోటవరాజుల గుడివద్ద పొంగళ్లు విటలు, కొట్టుకొని ఏ తబ్బాలేకుండా వచ్చారు. రెడ్డి పార్టీ వాళ్ళు అనుకున్నారు; ఏదైనా తగవ తెపారంటే చూసుకుందామని.

గ్రామంలో కూలివాళ్ళకి గిరాకి. పైరు చేయడానికి మనుషులు దొరకడంలేదు. ఏం చేస్తారు? బయట పల్లెల్లోంచి పిలుచుకొస్తున్నారు. ఇరు పార్టీలవాళ్ళు ఒకర్ని మించి ఒకరున్నారు.

వర్షంపడి చెరువులు నిండినవి. తూము నుండి నీరు పూరికంతా పారించుకుంటారు. అదును దున్నటంలో మునిగిపోయారు అందరున్నూ.

పనివస్తే వీపుకు గుడ్డకట్టి పనిచేసే అలవాటు రెడ్డికుంది. వర్షం నీళ్ళతో మడి దున్నించేశారు. వరి వూడ్పు కానించేశారు. రెడ్డి సేద్యగాడు చిన్నసామి చెరువునుండి నీళ్ళు తిప్పుకొస్తున్నాడు. కాలువగుండా నీళ్ళు వస్తున్నాయి. వచ్చే నీళ్ళను మడికి పెట్టి నీళ్ళొస్తుండా లేదా అని ముందుకు పోయాడు. కాలువలో నీరు పూర్తిగా నిలిచిపోయింది. ఆదరాబాదరాగా చెఱువు వరకు పరిగెత్తాడు కోపంగా. తూము ఎత్తిన నీళ్లంతా నాయకుని పార్టీ వాళ్ల చేనకు తిప్పుకుని వున్నారు. నాయకుని అల్లుడు నీళ్ళు కట్టుకుని పోతున్నాడు. చిన్నసామి పూర్తిగా నీటిని కట్టుకున్నాడు. అక్కడే నిలబడ్డాడు ఎవడొస్తాడో చూస్తానని.

అంగలేసుకుంటూ నీలయ్య వచ్చిరావటంతోనే 'రెడ్డయితే మీ వీధికే. మా దగ్గర చెలామణీ కాదు."

"ఆఁ ఏమన్నావురా కుంకా?" చిన్నసామికి కోపం వచ్చింది.

"కుంకా అనవయ్యా అను. నీళ్ళు పారించుకోడం తప్ప. చెరువు నీదే సొంతమయినట్టు"

"వాగకుండా విను మరి. నీళ్ళు ముందు తిప్పింది నేను. నువ్విప్పుడొచ్చావ్. వచ్చి రాకుండానే పూర్తిగా కట్టుకుని పోయేందుకు చూస్తున్నావ్."

> ఉపాధ్యాయుడు— భూమికి ఆకర్షణ శక్తి కలదని రుజువు చేయడానికి ఒక ఉదాహరణ ఇవ్వరా, గోపీ.
>
> గోపీ— చంద్ర మండలానికి అమెరికా వారు పంపిన రాకెట్లు అన్నీ భూమి ఆకర్షణ శక్తివల్లనే తిరిగి వస్తున్నవండి.
>
> —ఎల్. వి. కె. శర్మ (గుంటూరు)

నీలయ్య ఏం చెప్పకుండా నీళ్లు పూర్తిగా కట్టేశాడు. చిన్నసామికి నాయకుని అల్లుడంది గమనించలేదు. ఎవరైతేనేం? నీళ్లు పూర్తిగా కట్టుకున్నాడు. ఎవరికి వాళ్లే కట్టుకుంటున్నారు.

చిన్నసామిక వూరుకోలేకపోయాడు. పారకాడతో ఒకటిచ్చుకున్నాడు. నీలయ్య చేతో ఒకటిచ్చాడు. ఇద్దరూ కొట్టుకున్నారు తీవ్రంగా.

రెడ్డి ఆ సమయాని కొచ్చాడక్కడికి. చిన్నసామి వుత్సాహం అధికమైంది. కొట్టడం ఎక్కువ చేశాడు.

"చిన్నసామీ! ఆపు"

"ఆపేదెందుకూ? నీళ్ళంతా మహా పిడిసాతయినట్టు. ఎవడబ్బదని పూర్తిగా నీళ్ళు కట్టాడో చూస్తా" గసపోసుకుంటూ అన్నాడు.

"చాలు, ఒకణ్ణి అన్యాయంగా చావకొట్టడమే."

"పాపంరాదు కసితీర కొట్టా."

రెడ్డి పట్టుకున్నాడు చిన్నసామిని. నీలయ్య పరిగెత్తాడు. జరిగిన సంగతి చెల్పుకున్నాడు రెడ్డి.

నీలయ్య బాధగా ఇల్లు చేరుకున్నాడు. నిగుచేటు ఎవరికైనా చెప్తే. చిన్నసామి కట్టిన నీళ్ళు కట్టడం తప్పే. అదికూడా పూర్తిగా.

"ఆఁ ఎంత తిమురు" అని రంగానాయకుడంతా విన్నాడు. "సరి" అని చెప్పాడు. "ఇది ఎవరికీ చెప్పకూడదు. ఇప్పుడు కాదు. దీనికి తగిన తరుణం వస్తుంది అప్పుడు చూసుకుందాం."

అంతటితో ఆ విషయాన్ని ముగించేశాడు. మరచిపోయినవానిలా వుండిపోయాడు.

రెండు నెలలు పనుల్లో నిమగ్నులై పోయారు. ఈవీధి కా రెండు వీధులకి ఎడాపెడంగానే వుంది.

ఆదినం రెడ్డి వరికోసి కళ్ళంలోనే వుంచి రాత్రికి చిన్నసామిని కాపలగా వుంచాడు. చిన్నసామి ఒక్కడే పడుకున్నాడు. మునుపు ఏ వస్తువును ఎవరూ ఎత్తుకునిపోరు. కావలికి సరిగా వెళ్ళరు. రోజులు మారింది. మనుష్యులతరహాలు పూర్తిగామారిపోతున్నాయి. పనికిరాని వస్తువు పెద్దదౌతున్నది. పెద్దవస్తువు కొరగాకుండా పోతున్నది.

చిన్నసామి కంబళిఈడ్చి కప్పుకున్నాడు. గాలి, చలి గాలి. గజగజలాడేస్తుంది. పగలంతా కష్టపడటి పోయిగా నిద్రొచ్చింది. గుర్రుపెట్టి నిద్రపోయాడు.

వెన్నెల పుట్టింది. పుచ్చపువ్వులా కాస్తోంది వెన్నెల. రంగానాయకుని వెన్నంటి కొందరొచ్చారు. చీమ చిటుకుమనకుండా కిరసనాయిలు పమ్మరించారు వడ్లలో. అగ్గి

# పరిష్కారం

పుల్ల గీచి ముట్టించారు ఒక మూల పరుగు లంఘించుకున్నారు.

రగిలి పొగ లేసింది. అంటుకుంది కళ్ళం తా. మంట లేసింది పైకి. చిన్నసామికి చటుక్కున మెలకువ వచ్చింది. కాలుతున్న కళ్లాన్ని తేరిపారచూచి కొరివికట్టె దయ్య మేమో బెదరి పారిపోయాడు. ఆ ప్రాంతంలో దయ్యాలు ఎక్కువ. తర్వాత నిదానించి ముందు చూసి వడ్లు కాలుతున్నదని నిర్ధారించుకున్నాడు. రెండు ఫర్లాంగు లుంటుంది ఊరు. వెళ్ళివచ్చేలోగా కళ్ళం పూర్తిగా కాలిపోతుంది. ప్రయోజనం పూజ్యం - వెళ్ళినా గాని, అరచినా గాని ఫలితం వుండదనుకుని దగ్గరకు వెళ్ళాడు. ఆలోచించిన కొద్దీ తనకి స్ఫురించింది ఒక యుక్తి. పరిగెత్తి వచ్చి వరిపోగల్ని మంటపై క్రుమ్మరించాడు. వడ్లు పటపటలాడుతున్నాయి దగ్గరకు రానివ్వకుండా. సాహసించి పది మోపుల్ని వేసాడు. తగ్గింది అగ్గిపోగరు. ఇదే మంచి సమయ మనుకుని ఎక్కువగా వేస్తున్నాడు. కంబళి పొడుగ్గా వుంటే కప్పేడు దాన్ని. సగం బూడిదైంది. సగమైనా మిగిలినందుకు సంతోషించాడు.

కిరసనాయిలు వాసన చూచి ఇది కావాలని చేసిన పనే అని నిర్ధారించాడు.

ఇంటికెళ్ళి రెడ్డిని లేపాడు.

"ఏమైంది. ఏమైంది" అంటూ నిద్రమత్తులోనే అడిగాడు రెడ్డి.

"వాళ్ళు మన కళ్ళానికి కిరసనాయిలు పోసి అగ్గి పెట్టేశారు."

"అగ్గి పెట్టేశారా. పద పద." పరుగు లంఘించుకున్నాడు. చిన్నసామి వెనకే వచ్చినా రెడ్డి పరుగు పట్టలేకపోయాడు.

కళ్ళంపై కంబళి వుంది. కిరసన్ వాసన గుప్పుమంది. నిర్ఘాంతపోయాడు రెడ్డి.

"ఎలా. ఆర్పేయగల్గావ్ చిన్నా?"

"సగం మంట వచ్చింది. మెలకువ వచ్చింది కాదు. నిద్రనుండి చూద్దూ. అన్న. అంతెత్తు మంట. దయ్యమని పారిపోయి కాదనుకుని కుదురుపడి వచ్చి పోగలు దబదబా వేశాను. కంబళి కప్పేశాను. దేవుని దయ. లేకపోతే ఇదయినా చూచేవాళ్ళం కాదు."

రెడ్డి చిన్నని కేసి, అతని ముఖాన్ని చూస్తున్నాడు. అటు కళ్ళాన్ని మరోసారి చూశాడు.

"దమ్ములేని దద్దమ్మలు. కావాల్సి వ్యాజ్యానికి పిలవకపోతే కూడరగదో ఏమో. మనుష్యులపైన చూపించేది కసి. అచేతన వస్తువులపై నాయకుని కసి చూపించాడు. సరే తను ముందు జాగ్రత్తగా వుండడం మేలు. అనుకుని రెడ్డి అక్కడే రాత్రంతా ఉన్నాడు చిన్నసామితో.

మర్రోజు రెడ్డి పార్టీవాళ్ల ముఖాలు వెలవెలపోతుంటే పెద్దవీధివాళ్ళు లోలోపల నవ్వుకున్నారు.

నాయకుడు ఏమీ ఎరగనట్టు చింతతోపు నుంచి వస్తున్నాడు. నాయకుని వెన్నంటి వెళ్ళే ఆప్తమిత్ర హనుమంతుడు వెంగడు పడి పడి నవ్వుకుంటూ పోతున్నాడు. మీసం మెలేస్తున్నాడు నాయకుడు.

రంగానాయకుని అహంకారాన్ని రచ్చపైనుండి గమనిస్తున్నాడు రెడ్డి.

రెడ్డికళ్ళంలో జనం చేరిపోయారు. చిన్నసామి ముఖం చిన్నపోయింది.

"రెడ్డీ! నీ శాంతమే ఇంతకి తెచ్చింది. మా మాట విను. రాత్రికి నాయకుని చెరుకుతోట ధ్వంసం చేసేస్తాం. ఊఁ అను. నరికినవాణ్ణి నరకడం. దీన్లో తప్పేముంది......నువ్వెంతయినా చెప్పు. రాత్రికి ఖాయంగా జరగాల్సిందే..."

"జరగాల్సింది జరిపించండి. నాకు చెప్పటమెందుకు. వాళ్లు చేశారని మనమూ చెయ్యాల్సిందేనా? వాళ్ళకి తెలివిలేదు. మన తెలివిని వదులుకుని మనమూ చేసేద్దామా? మనకీ కోపం వచ్చేదే. కోపంలో ఏదో అనెయ్యొచ్చు. తర్వాత ఆలోచిస్తే కోపం రాదు. తదనుకుంటాం. సఖ్యంగా తేదంటాం. ఆనాడు నీలయ్యని కొట్టింది చూస్తే గుండె తరుక్కుపోతుంది. వాళ్ళు పని చూపించారు. నాకూ కోపంగా వుంది రాత్రి వాళ్ల పని. కాని గ్రామమని ఓర్చాల్సివస్తుంది."

"మరి నీ ఉద్దేశ్యం?"

"ఒదని. కళ్ళంకాల్చారని చెరుకుతోటకు నిప్పు పెడదామా? చెప్పండి."

"రెడ్డీ... మన మూరుకుంటుంటే వాళ్ళే మొనగాళ్ళలా మనల్ని చెత్తచేసి పారేస్తున్నారు. రాత్రికి మన పని మనం చూపిద్దాం. అప్పటికైనా తెల్సుకుంటారో లేదో. ఇంకా చేస్తారో?"

"ఈ పని నా కిష్టంలేదు." లేచాడు రెడ్డి.

రెడ్డి కిష్టంలేంది జరిపి ప్రయోజనం లేదు. రెడ్డి అసమ్మతంగా జరిపితే కోపిస్తాడని వాళ్ళకందరికీ తెల్సు. అంతటితో వాళ్ళు లేచొచ్చారు.

ఈ పార్టీ గొడవలో ఎందరికో హాని కల్గింది. ఏదో సర్దుకొనక కక్ష కక్షతో కాలుస్తున్నారు ప్రతీ పనిని. మంచివాళ్లు ఇందులో చేరకూడదు. చేరక తప్పలేదు. రెడ్డికి గ్రామకక్ష బాగా తోచలేదు. ప్రక్క గ్రామాల్లో తన గ్రామమంటే చులకన. ఆఖరు పల్లె కూడా తనపై అభాండాన్ని వేస్తున్నారు. తన మూలంగానే పార్టీలవుతున్నాయని పుకారు తనదాకా వచ్చింది. గ్రామం ఏకం చెయ్యాలనే ఉద్దేశ్యం ఉంది. వాళ్ళి వీధిగుండా వెళ్ళేందుకు ఒప్పుకోరు. తన పార్టీ వాళ్లు వంకగుండా వెళ్లేందుకు సమ్మతించలేదు. తమ పట్టు గట్టిగా నెరవేరాలనే పట్టుదల ఇరుపక్షాల్లో తీవ్రంగా వుంది.

పది రోజులు ఆలోచించాడు రెడ్డి తీవ్రంగాను, అదేపనిగా కూడా.

ఏడూర్ల పెద్దమనుష్యుల్ని సమావేశపరచి ఊరిని ఏకం చెయ్యమని అడుక్కున్నాడు. పెద్ద మనుషులు అవతలి పార్టీని పిలిపించారు. వాళ్ళు రావడానికి వెనకేశారు. ఒకాయన వెళ్లి వాళ్లని సముదాయించి తీసికొచ్చాడు. రాత్రి పది గంటలకు రంగానాయకుడు పదిమందితో వచ్చి నిశ్శబ్దంగా కూచున్నాడు.

ఎంత చెప్పినా రంగానాయకుడు ఒప్పుకోకుండా ఉన్నాడు. రెడ్డి పార్టీవాళ్ళూ ఒప్పడంలేదు. వచ్చిన పెద్దలు కచ్చితమైన మాటలో వున్నా ఉత్తరదక్షిణధృవాలకున్నంత తారతమ్యంలో వుంటున్నారు ఇరుపార్టీలు.

వంకవైపు వెళ్ళమంటే రెడ్డిపార్టీకి, వొద్దు వీధిగుండా పోనీ ప్రభని అంటే నాయకుని పార్టీకి కోపం. ససేమిరా అంటున్నారు. శతవిధాల పోరాడినా వచ్చిన పెద్దలకి వీలు కాకుండా పోయింది. అప్పటికే తెల్లవారి రెండవబోతున్నది. మధ్య ఒక త్రోవ కన్పిస్తున్నది. ఉత్సవం ఆపేస్తే అది జరిగే విధమేనా? దేవుని ఉత్సవాన్ని ఆపటమా? ఇది మరీ బాగుందన్నాడు నవ్వుతూ రెడ్డి.

మొదట నాయకుడు సందిచ్చాడు. గత సంవత్సరంలో పోనిచ్చాడు. దాన్ని ఆసరాగా చేసుకుని రెడ్డివాళ్ళు అడగటంలో తప్పులేదని అన్నాడొకాయన. అక్కడొచ్చిన వాళ్ళు అవునవునని తలూపారు. నాయకుని కిదేమీ నచ్చలేదు. తన్ను అవమానం చెయ్యాలని కాకపోతే రెడ్డి ఈ పంచాయతీని ఏర్పాటు చేస్తాడా? వంకంటి పోతే తప్ప నేనొప్పుకోనని ఖచ్చితంగా చెప్పేసి వచ్చిన వాళ్ళతో వెళ్ళిపోయాడు.

ఇంకేం చెయ్యడం? పెద్దలు కూడా రెడ్డికి చెప్పి వెళ్ళిపోయారు. అప్పటికే తొలికోడి కూసేవేళ.

రచ్చపైన రెడ్డి కూలబడి పోయాడు. ఏడూర్ల పెద్దలకి తమ వూరంటే చులకన. పార్టీ గ్రామం పనికిరాని కక్షలనుకుంటారు. చుట్టుప్రక్క వూర్లకి తలొంపులేనా? దీనికి వేరే గత్యంతరం లేదా? తన త్యాగంతోనైనా ఏకం చెయ్యలేడా? మునుపటి పార్టీలంతరించి ఐకమత్యాన నడిపిస్తాను. మిగిలిన

(58-వ పేజీ చూడండి)

**A PRACTICAL GUIDE TO ANDHRA PRADESH T. A. Rules By**
శ్రీ కే. రమణస్వామి, సీనియర్ యస్. ఏ. ఎస్., అకౌంటెంట్ - ఓ ట్రెయినింగ్ సూపరింటెండెంటు, అకౌంటెంటు జనరల్ ఆఫీసు, (ఏ. పి.) మద్రాసు-2. కాపీలకు:
15, లింగార మొదలివీధి, మద్రాసు-17.
ధర రు. 3. ॥ పోస్టేజి అదనం.

# పరిష్కారం

(10-వ పేజీ తరువాయి)

గ్రామాలకి తక్కువగా బ్రతకదు తన గ్రామం.

"రెడ్డీ! పోదామా ఇండ్లకు" అన్నారు రెడ్డిపార్టీ వాళ్ళు.

"పోకే ఇక్కడే ఎంతకాలం వుంటాం?" ఆయాసంగా అని "మీరంతా నా మాట వింటారా" అడిగాడు.

"అదేందయ్యా! ఎప్పుడైనా నీ మాట కాదని చెప్పామా?" ఏడుగ్రామాల పెద్దలు వెళ్ళిపోయారు నీచంగా అనుకుంటూ. వాళ్ళంతా గేలిచేస్తారు. నేనొకటి మిమ్మల్ని అడుగుతా దేవుడు వంకంటిపోతే ఏం? వీధంటిపోతే ఏం? మనం శుభ్రంగా వెళ్దామంటుంటే వాళ్ళు గబ్బులో వంకలో పోవాలంటున్నారు. వాళ్ళ గొప్పగా వుండిపోనీ; వాళ్ళదే పౌరుషంగా వుండిపోనీ.

"అయితే ఏమంటావ్?"

"వంకంటి వెళ్ళనీ ప్రభ. వాళ్ళకే లేని అసహ్యం అపరిశుభ్రం మనకు మాత్రమేం? దేవుడు శిక్షిస్తే వాళ్ళే అనుభవిస్తారు. మామూలు మామూలనని. వదిలేయండి. కొంత పట్టుపట్టి ఓడిపోయాం అనే అనుకుందాం. ఇందులో తగ్గేది హెచ్చేదీ ఏదీ లేదు. ఇప్పుడు కాకపోతే ఏనాటికైనా ఈ తత్వాన్ని తెల్సుకుంటారు. వీళ్ళ తరం కాకపోయినా వచ్చే తరమైనా తెలుసుకోనీ. బాగుపడితే పడనీ లేకపోతే పోనీ. చిన్న విషయానికే ఇంత రగడలా?"

"ఆ...ఆ...వాళ్ళకు లొంగడమే?"

"లొంగినట్టు కాదు. ఏడూళ్ల తీర్పు మనపైన్నే వుంది. అది చాలదా? ఓడిపోయామనుకోండి. ఇందులో రావడం పోవడం లేదు కీర్తి. ఇంకొకటి జ్ఞాపకముంచుకోండి. మన మెన్నాళ్లు పోరాడినా మన సంఖ్య తక్కువే. పోనీలే వాళ్లే గొప్పగా వుండనీ గాక మనం తక్కువే అనుకుందాం......"

"అయితే ఇన్నాళ్ళు పోరాడి"

"ప్రయోజనం లేదంటారు. ఇప్పుడు చూశేదూ? తీర్పు వినలేదూ? ఎప్పుడూ ఒకటిగా వుండినవూరు వేరైంది, బలహీనమైంది. మన తాతల కాలంలో ప్రాంతానికే పేరుతో బ్రతికిందీ గ్రామం. చెల్లాచెదరైందీనాడు! నా మాట వినండి. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు".

ఎంతెంతో వాదించినా రెడ్డి సరైన సమాధానంతో చప్పున చల్లబడిపోయారు. సరేనని తలలాడించారు. మునుపటి రోషాలు విడనాడాలనీ అంతా ఒకటిగా వుండాలని, ఒకవేళ వాళ్లేమైనా చెప్పినా ఓర్పుతో సహించాలని రెడ్డి ఒప్పించి మరి వదిలాడు.

మనస్సునుగురించి చెప్పలేం. ఏదోస్థిరమైన మహాత్ములకు తప్పితే కొద్దికాలానికే మార్పు వచ్చేస్తుంది. రెడ్డి మారిపోలేదు. సరళత్వానే వుండేవాడు. ఇంకా సరళత్వానికొచ్చాడు.

రెడ్డి మరికొందరుతో నాయకుని మిషను వైపు పోయారు. మిషను మంచంపై కూర్చుని వున్నాడు నాయకుడు. కొట్టడానికొస్తున్నారా అని అనుమానించాడు. ఇంతలోనే రెడ్డి ముందొచ్చి

"రంగానాయకుడూ! మీరూ మేము అనే భేద మెందుకు? మన మొకటిగా ఉంటే ఇతర గ్రామ పెద్దలు కాని మరెవ్వరు కాని మన విషయంలో తలదూర్చేందుకు వీల్లేదు. మనిద్దరమే చాలదూ? వంకంటి దేవుడు వెళ్ళలేదనేగా మీ ఆక్షేపం. పోనీలే వంకంటే మాకదే సమ్మతం" అన్నాడు మెల్లగా.

"ఆఁ నిజంగానా" కన్నులు పెద్దవిచేసి ఆశ్చర్యపోయాడు. "నిజమే! వంకవైపే తీసికొని వెళ్దాం. అంతా కలసి ఉత్సవం జరిపిస్తే గ్రామ కళంకం అప్పుడు పోగు. తిరువాళ్ళు ఉమ్మడిగా చేసి మీరు మేము అనే భేదం లేక ఒకటిగా వుందాం సరేనా?"

"నిజమేనా? నవ్వులాటకి చెప్తున్నావా రెడ్డీ?"

"రాత్రంతా యోచించే తీర్మానానికి వచ్చాను. ఇక మనం వేరనే భావన వుండకూడదు. చూడు దేవుని విషయంలో నా ఈ విభేదాలు? వీధులు వేరయినా గ్రామమొకటే. భావాలు వేర్లయినా గ్రామ నడక ఒకటే. వూరుని ముందుకు తేవడం వదిలి వూరికే గిల్లికజ్జాలు తెచ్చుకుని కొట్లాడుకోవడమా? నన్ను వీళ్ళంతా పిరికివాణ్ణని అంటున్నారు. నువ్వే చెప్పు నేను పిరికివాణ్ణా. నమ్ము, నమ్మకపో మనిద్దరితో ఈ కక్షలు సమసిపోవాలి. ఈ తరంతోనే దీన్ని మరపించాలి. ఇది ఒక అంటువ్యాధి. దీనికి మందే లేదు. వ్యాపించిందంటే నరబలులు కావాలంటుంది. గ్రామాలు నాశనమవ్వడానికి మూలకారణం మనలో మనం ద్వేషించుకోవడం, కొట్టుకోడం. ఈర్ష్యతో క్రుంగిపోయే రైతులకు ఇకదారే లేదు. కాబట్టి ఇంతటితో ఈ ద్వేషానలాన్ని ఆర్పినట్టేనా?"

"వంకంటి అంటే ఈ బేజారు కోపాలుండేవి కావు. పద వెంకరెడ్డీ! వూళ్ళోకి. వుత్సవపు ప్లాను తయారుచేద్దాం.

చేతులు చేతులు కూర్చుకుని రెడ్డి నాయకుడు పోతుంటే ఇరుపార్టీలవాళ్లు ముక్కుపై వేలుంచుకున్నారు. అటువైపే చూస్తున్నారు.

పౌర్ణమినాడు బ్రహ్మాండంగా వుత్సవం జరిగేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అంతా కలసితిరుగుతున్నారు. రెడ్డి-నాయకుడు ఇద్దరు ఎక్కడికివెళ్ళినా ఇద్దరుంటున్నారు, శ్రీకృష్ణ అర్జునుల్లాగా.

నాలుగురోజులుంది తిరునాళ్లు. ఏదో పనుండి వంకనుండి వస్తున్నారు. నాయకుడు ముక్కుమూసుకుని "ఛ ఛ" అని విరవిరా నడచి వీధికొచ్చేశాడు.

"చూశావా రంగానాయకుడూ చెడ్డ వాసన. ఆ వైపు వెళ్లాలంటున్నావు. నీకే సహించలేకపోయావే"

"దుర్గంధమాత్రం విపరీతంగా వుంది. వంకంటిపోవాలి. ఇది పోవడం యోచిద్దాం"

"రాత్రికి పంచాయితి చేర్పించి"

"జరిపించి" అన్నాడు నిలిచి ఆత్రంగా.

జరిపించి వంకలో మలమూత్రం వదలకూడదని వుత్సవం జరిగేంతవరకు కట్టుమానం (ఖండితంగా) చేద్దాం. మలమూత్రం వదిలితే అపరాధం వేస్తామా? ఎవరి ఇంటిముందు వుంటే వారికి అపరాధం తప్పదు.

"అదికూడా బాగాలేదు రెడ్డీ"

ఆలోచనలో పడిపోయాడు రెడ్డి. తటుక్కున ఓ మంచి ఆలోచన తట్టింది.

"ఇటు చేద్దాం. వంకపైన మెట్టభూములున్నాయి. వాటిలో వేరుశెనగ, కంది, పెసర వగైరా చల్లుతారు. మిగత కాలాల్లో ఊరికే వుంటాయి. మిగిలిన కాలాల్లో ఉత్సవం పెట్టుకుని వంకలో కాక వంకపైన చేన్లగుండా పోవడం ఊరుదాటి వంకలోనే తీసుకెళ్ళడం ప్రభని. ఇలాచేస్తే వంకలోపోయినట్టూ, శుభ్రంగా వెళ్లినట్టూ ఉంటుంది. మైదానంనుండి రావడంలో కూడా అదే విధంగా. సరిగ్గా ఉందా."

"అవును రెడ్డీ. ఆ వాసన లేక దూరంగా ఊరు వెళ్లేంతవరకు వంకపైన తర్వాత శుభ్రమైన వంకలో. ఇది అందరికీ బాగుంటుంది." సంతోషాన్ని వ్యక్తపరచాడు నాయకుడు.

అందరీ ఆలోచన విని బాగన్నారు. సరే అంటే సరి అన్నారు.

పౌర్ణమిరోజున అందమైన ప్రభతో సంతోషంగా ఉత్సవం జరిగింది. కోలాహలంలో గుమిగూడి ఊరూవాడూ ఏకమైంది.

పార్టీలు అంతరించాయి. ★

---

ఉపాధ్యాయుడు — కర్ణుడు ఏ యుద్ధంలో మరణించాడో చెప్పు.

విద్యార్థి — ఆఖరి యుద్ధంలోనండి.

—ఎల్. వి. కె. శర్మ (గుంటూరు)

* * *

లెక్కల మాస్టారు — పదిమధ్య సున్నా పెట్టితే ఏమవుతుందిరా?

విద్యార్థి — 'పంది' సార్.

—కళా సత్యనారాయణ మూర్తి (హైదరాబాదు)